కాతేరులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-5 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.భవాని ఆధ్వర్యంలో కాతేరులో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని అనేకమంది ప్రజలు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారని ప్రోగ్రామ్ ఆఫీసర్ తెలిపారు. రాజమహేంద్రవరం జిజిహెచ్ వైద్యులు బి.శ్రీనివాసరావు నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది డి.స్వప్న, ఎం.ఇందిర, ఎస్.ప్రసన్నకుమార్, డి.సాంబయ్య పాల్గొన్నారు. సచివాలయం ఇఒ రాధాకృష్ణ సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను తమ కళాశాల ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఆయన అభినందించారు.

నాడు హామీలు... నేడు అరెస్టులా...

- పలుచోట్ల అంగన్‌వాడీల నిర్బంధం
- ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం
- కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా

అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడపై ప్రభుత్వం నిర్బంధకాండకు దిగింది. ముందస్తుగా సంబంధిత అధికారులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ధర్నాకు విజయవాడ వెళ్తున్నట్లు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వ ఒత్తిడితో ఐసిడిఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్‌ల పేరుతో అంగన్‌వాడీలను చలో విజయవాడకు వెళ్లకుండా కుట్రలు సాగించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలు వీరి కుట్రలను ఎదుర్కొని విజయవాడకు తరలివెళ్లారు. తుని, సామర్లకోట ప్రాంతాల్లో అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అధికారుల ఒత్తిడితో సెక్టార్ మీటింగ్‌లకు హాజరైన అంగన్‌వాడీలు అక్కడే తమ నిరసనను వ్యక్తం చేశారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కనీస వేతనాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన 42 రోజుల సమ్మె సందర్భంగా తెలుగుదేశం నేతలు న్యాయమైన కోర్కెలను తీర్చుతామని నాడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయాలని కోరిన అంగన్‌వాడీలను అరెస్టు చేయడం దారుణమని సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు బయలు దేరిన అంగన్‌వాడీలను తుని, సామర్లకోట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కచేరిపేట సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, శంఖవరం రాజేశ్వరి, పిఠాపురం గంగాభవాని మాట్లాడుతూ చారిత్రక 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా శిబిరాల వద్దకు వచ్చి కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా జీతాలు పెంచకపోవడాన్ని వారు తప్పుపట్టారు. బతికుండగా వేతనాలు పెంచకుండా, చనిపోయాక మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని అంగీకరించి, రూ.15 వేలే చెల్లించేలా జీవో ఇచ్చినందుకు కూటమి నేతలు సిగ్గుపడాలన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించి చేతులు దులుపుకుంటామంటే ఒప్పుకునేదిలేదన్నారు. సెంటర్ అద్దెలు, వంట ఖర్చులు నెలల తరబడి బకాయిలు పెడితే ఇచ్చే రూ.11వేల వేతనం వీటికే సరిపోతుండగా, కుంటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మొబైల్ యాప్ పని భారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లుగా గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయాలని, మినిట్స్‌లో అంగీకరించిన అంశాలన్నింటికీ జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, అంగన్‌వాడీలు సత్యవతి, వీరవేణి, నారాయణమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కాజులూరు, గొల్లపాలెం సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీలను సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్ పేరుతో అడ్డుకున్నారు. చలో విజయవాడపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడంతో కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలతో ధర్నాకు వెళ్లమని వారితో సంతకాలు పెట్టించుకుని అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీలు సెక్టార్ మీటింగ్ వద్దే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సెక్టర్ లీడర్ హనుమావతి మాట్లాడుతూ కాకినాడలో జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం కోలంక సెక్టర్ లీడర్లు వరలక్ష్మి, అన్నవరం అంగన్‌వాడీలు సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, మాత శేషారత్నం, మామిడి ప్రసన్న, కె.అరుణ పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. చలో విజయవాడ వెళ్లకుండా వారిని అడ్డగించి వెనుకకు పంపివేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అంగన్‌వాడీలను గృహనిర్బంధాలకు, అరెస్టులు చేయడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే వైసిపికి పట్టిన గతే కూటమి పార్టీలకు పడుతుందని హెచ్చరించారు. **శంఖవరం** ఛలో విజయవాడ బయలు దేరిన అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి అన్నవరం రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయం చేయాలని కోరుతున్న తమను అడ్డుకోవడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బుల్లెమ్మ అన్నారు.

పెరవలి : చలో విజయవాడ నేపథ్యంలో మండలంలోని అంగన్‌వాడీలపై పోలీసులు నిర్బంధం విధించారు. పెరవలి ఐసిడిఎస్ పరిధిలోని నిడదవోలు, పెరవలి మండలాల నుండి సుమారు 150 మంది అంగన్‌వాడీలు రైళ్లు, బస్సులపై విజయవాడకు పయనమయ్యారు. తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో కొంత మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను కిందకు దింపేశారు. వారిని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెరవలి మండలం అంగన్‌వాడీలను తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో అడ్డుకుంటున్న పోలీసులు

టిడ్కో గృహాల సమస్యలను పరిష్కరించాలని నినదిస్తున్న సిపిఎం నాయకులు

నిడదవోలులో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - నిడదవోలు

సిపిఎం ప్రజా చైతన్య యాత్ర సోమవారం నిడదవోలులో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సోమవారం సిపిఎం బృందం తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించింది ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం 1,200 మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మించిందన్నారు. కొంత డబ్బు ప్రభుత్వం లబ్ధి దారుల నుంచి వసూలు చేసిందన్నారు. 2018లో నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఇళ్లను లబ్ధి దారులకు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. అప్పట నుంచి చేసిన అప్పులకు పేదలు ఇంకా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నారన్నారు. లబ్ధి దారులకు ప్రభుత్వం ఇళ్లు అప్పగించకపోయినా, బ్యాంకర్లు మాత్రం వాయిదాలు కట్టించుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8నెలలు కావొస్తున్నా ఇంత వరకు లబ్ధి దారులకు ఇళ్లు అప్పగించలేదన్నారు. ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు కూడా చేరుకుంటున్నాయన్నారు. తక్షణమే ఇళ్లను లబ్ధి దారులకు అప్పగించాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని రాంబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, నాయకులు జి.డానియేల్, జి.కృష్ణరసూల్, జి.ప్రసన్న, డి.రమేష్, కె.సత్యనారాయణ, శ్రీ రామ్, వి.ప్రభాకర్, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్షా సామగ్రిని అందించామని హెచ్ఎం కోటిపల్లి సరోజిని తెలిపారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి, ప్రస్తుతం సైనికునిగా సేవలందిస్తున్న వెలగదుర్రుకు చెందిన పూర్వ విద్యార్థి వీరవల్లి సాయికృష్ణ పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు వీటిని సమకూర్చారన్నారు. బంధువుల ద్వారా పాఠశాలలో పంపిణీ చేశారని తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ప్రోత్సాహకాలు సైతం అందించారన్నారు. ఈ సందర్భంగా సాయికృష్ణను ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

సామగ్రిని పంపిణీ చేస్తున్న హెచ్ఎం తదితరులు

ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - పెరవలి

మండలం జాతరలు, సభలు, సమావేశాలు, ఉత్సవాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తే ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు ఉపయోగించుకునేవారు ముందస్తుగా డిఎస్‌పి అనుమతి తీసుకోవాలన్నారు. జాతర, ఇతర ఉత్సవాల్లో అశ్లీల పాటలు, నృత్యాలు వంటివి నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశాలలో మాట్లాడేవారు వేరే మతం గురించి ఇతర కులాల గురించి కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. అలే చేస్తే వారితో పాటూ, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని పెంటపల్లి గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపిపి నిధులు రూ.4లక్షలతో ఈ పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భర్త సుంకర వీరబాబు, వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు, సూరంపాలెం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, సర్పంచ్ బాదంపూడి హర్షిత, బి.ప్రకాష్, ఎంపిటిసి గండికోట వెంకటరమణ, రామకృష్ణ, టిడిపి గ్రామ అధ్యక్షుడు సత్యం వెంకటేశ్వరరావు, నాయకులు నారా ప్రసాద్, దాకారపు గంగాధరం, బండి నాగేశ్వరరావు, కె.రత్నరాజు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఇండస్ట్రస్ సేఫ్టీ కమిటీ, 16వ డిఐఇపిసి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత 15వ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు, అనంతర నివేదికపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పరిశ్రమలకు సంబందించి గణాంకాలు కాకుండ పరిశ్రమలు కోసం వచ్చిన దరఖాస్తులకు అనుమతుల జారీలో ఎందుకు జాప్యం ఉందో నివేదికను కమిటీ ముందు ఉంచాలన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన శాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. జిల్లాలో అవకాశం ఉన్న రంగాల్లో వ్యాపారం చేసేవారిని ప్రోత్సహించాలన్నారు. ఆర్గానిక్ జీడి పరిశ్రమ, కాటన్ క్లాత్స్ - చేనేత వస్త్రాలు, గిరిజన ఉత్పత్తులు, అలంకార మొక్కలు, పూల ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశం ఉందని, ఆమేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమల్లో కొన్ని నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలు నెల రోజులకు, మూడు నెలలకు, ఆరు నెలలకు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించి, అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయా పరిశ్రమలలో అలారింగ్, సెన్సార్ పరికరాలు కచ్చితంగా పనిచేసేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ప్రతి పరిశ్రమ ప్రమాణాలు పాటిస్తుందో లేదో చూడాలన్నారు. పరిశ్రమలో పనిచేసే వారికి, పరిశ్రమ పరిసర ప్రాంతాల ప్రజలకు, పర్యావరణానికి సంబంధించిన ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. రానున్న రెండు నెలలకు చెందిన పరిశ్రమల తనిఖీ కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సభ్యుల గైరాజరుపై వివరణ కోరాలని, తదుపరి సమావేశంలో గైర్హాజరైన వారి పేర్లు మినిట్స్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

గ్రోత్ హబ్ కింద తూర్పు గోదావరి జిల్లా

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ బృందం విశాఖ, విజయ నగరం, అనకాపల్లి, తూర్పు గోదావరి జిల్లాలో పరిశ్రమలు, తయారీ రంగం, సేవా రంగం కింద అందుబాటులో ఉన్న అవకాశాలు పరిశీలించేందుకు పర్యటనకి రానున్నట్లు కలెక్టర్ తెలిపారు.. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నాలుగు రంగాల్లో గ్రోత్ హబ్‌కు అవకాశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే క్రమంలో నర్సరీ అనుబంధ పరిశ్రమ - ఆధారిత విలువ జోడించిన సేవలు, మైక్రో ప్లాంట్స్, అలంకార మొక్కలు, టైల్స్ పరిశ్రమ, ఆగ్రానిక్ జీడిపప్పు, హెర్బల్ ఉత్పత్తులు, సేవా రంగం ఆయా రంగాల్లో అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఏప్రిల్ నెలలో నీతి అయోగ్ పర్యటక ఉంటుందని తెలిపారు. ఆ మేరకు ఆయా రంగాలకు చెందిన వారితో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి వనిధర్‌రామన్, పరిశ్రమ ఇన్‌స్పెక్టర్ డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.తిరుమలరావు, పరిశ్రమల సహాయ సంచాలకులు ప్రదీప్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ జి.స్వాతి, ఇతర సమన్వయ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేకే తాడిపూడి ఘటన

ప్రజాశక్తి - తాళ్లపూడి

విచ్చలవిడిగా మంజూరు చేసిన ఇసుక ర్యాంపులపై సర్కారు పర్యవేక్షణ లేకపోవడం వల్లే తాడిపూడిలో గోదావరో ఐదుగురు యువకులు మృతి చెందారని వైసిపి నాయకులు విమర్శించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు తదితరులు సోమవారం తాడిపూడిలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్న కొడుకులను పోగొట్టుకున్న తల్లిదండ్రుల బాధను ఎవరు తీర్చలేరన్నారు. వైసిపి తరుపున ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఊరుకోవడమే కాకుండా కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారితో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మృతులకు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి

ప్రజాశక్తి - నిడదవోలు

కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రీ బాయికి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం సావిత్రిబాయి వర్ధంతిని కెవిపిఎస్, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిడదవోలు మహిళా కళాశాలలో నిర్వహించారు. తొలుత సావిత్రీ బాయి పూలే విగ్రహానికి కెవిపిఎస్ నాయకులు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాద సమాజంలో మతం, కులం పేరుతో తీవ్రమైన సామాజిక అంతరాలు ఉన్న దేశంలో 195 సంవత్సరాలు క్రితం ప్రగతిశీలం ఆలోచనలతో భర్త పూలేతో కలిసి బాలికా విద్యకు సావిత్రిబాయి చేసిన కృషి ఎనలేనిదన్నారు. మహిళలు చదువుకుంటేనే జాతి ముందుకు వెళుతుందని చాటిచెప్పారన్నారు. బాలికల కోసం పాఠశాలలు ప్రారంభించి చదువుచెప్పి దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయరాలిగా ఆమె ఖ్యాతి గడించారన్నారు నేటి తరం ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రదీప్, బి.కృష్ణ, కె.రాంబాబు, విష్ణు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణయ్ కేసులో తీర్పు పట్ల హర్షం

ప్రజాశక్తి - నిడదవోలు

నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ల ప్రణయ్ 2018లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష, మిగిలిన ఆరుగురికి యావజ్జీవ ఖైదు విధిస్తూ నల్గొండ కోర్టు తీర్పును ఇవ్వడం పట్ల కెవిపిఎస్ హర్షం వ్యక్తం చేసింది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఈ తీర్పు కుల అహంకార ఉన్మాదులకు హెచ్చరిక లాంటిదన్నారు. ఈ దారుణ సంఘటనపై కెవిపిఎస్, దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రం అంతా పోరాటం జరిగిందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కులాంతర వివాహం చేసుకున్నవారికి రక్షణగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశాయని గుర్తు చేశారు. కుల నిర్మూలనా జరగాలంటే సమాజం, ప్రభుత్వం కులాంతర వివాహాలను ప్రోత్సాహించాలన్నారు

ఘనంగా కోరుకొండ రథోత్సవం

ప్రజాశక్తి - కోరుకొండ

ప్రసిద్ధి చెందిన కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మ వారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి రథంపై ఆసీనులు చేశారు. అనంతరం కొండ వద్ద ప్రారంభమైన రథోత్సవం మెయిన్ రోడ్డు, హరేరామాలం రోడ్డు, చెలకలు, శివాలయం మీదుగా తిరిగి సాయంత్రం కొండ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్ష మందికిపైగా యాత్రికులు పాల్గొన్నారు. కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ టి.శ్యామ్ సుందర్ భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



రథాన్ని లాగుతున్న యాత్రికులు

కార్టూ'నిజం'



'యువత పోరు' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, దీన్ని నిరసిస్తూ ఈ నెల 12న చేపట్టే 'యువత పోరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. తాడిపూడి సర్పంచ్ నామా గోపాలం ఇంటి వద్ద యువత పోరుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, మాజీ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ వైఫల్యం చెందిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చి అన్ని రంగాల కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కె.రమేష్, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, పోలవరం ఎంపిపి ఎస్ వెంకటరెడ్డి, గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, వైసిపి జిల్లా నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయల, గూడ విజయరాజు, యాళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పతాకావిష్కరణలో పాల్గొన్న అధికారులు

సేవాభావాన్ని కలిగి ఉండాలి

ప్రజాశక్తి-కడియం

సేవా భావమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ధ్యేయమని, సమాజం పట్ల అందరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పిఎంశ్రీ పాఠశాలల్లో ఉన్న 160 మంది స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు కడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 14వరకూ ఐదు రోజుల పాటు రెసిడెన్షియల్ పెట్రోల్ లీడర్స్ ట్రైనింగ్ క్యాంపును ప్రారంభించారు. దీనికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలు జాతీయ, స్కౌట్ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్వశిక్ష ఎఎంఒ గౌరీశంకర్, సిఐ అల్లు వెంకటేశ్వరరావులు మాట్లాడారు. మిలిటరీ, పోలీసు ఆఫీసర్లు కావడానికి స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ, సిఎంఒ శ్రీనివాస్, ఎంఇఒ మణికుమార్, పలువురు స్కౌట్ అండ్ గైడ్ టీచర్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన వివిధ చోరీలపై నమోదు అయిన కేసుల్లో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి మనీష్‌దేవరాజ్ పాటిల్ ఈ కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులు, కరప, కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగిన చోరీ కేసులు జరిగాయన్నారు. ఈ కేసుల్లో ముద్దాయిలైన రూరల్ మండలం తూరంగి సత్యదేవనగర్ ప్రాంతానికి చెందిన గంపల సతీష్, కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పట్టిం వరప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా ఆయా చోరీలను ఉమ్మడిగా చేసినట్లు అంగీకరించారని తెలిపారు. వీరి నుంచి 78 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక హీరో సిడి డీలక్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, క్రైం సిఐ వి.కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు, ఎఎస్ఐలు గోవిందు, పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని రాజుపాలెం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు (29) ఆదివారం రాత్రి అత్తంటికి వీరవరం వెళ్తుండగా రాజుపాలెం సమీపంలో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో రహదారిపై టెంట్ వేసి, రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో డిఎస్‌పి శ్రీహరిరాజు సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఎట్టకేలకు ఆందోళన విరమించారు. దీంతో మృతదేహాన్ని శవ పంచనా నిమిత్తం ప్రత్తిపాడు సిహెచ్‌సి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. మతిడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ బిఎన్.కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని గాదరాడ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారని కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్పెషల్ పార్టీతో కలిసి దాడి చేయగా పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.84,760 నగదు, 13 సెల్ పోన్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరానికి చెందిన ముగ్గురు ఆర్గనైజర్లు పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

ఊబలంక శెట్టిబలిజనగర్ రహదారి వద్ద లారీ ఢీకొని ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తికి గాయాలైనట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం సోమవారం ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి తన భర్త రమేష్‌బాబుతో కలిసి బైక్‌పై కట్టుంగ వెళుతుంగా వెనుకనుంచి లారీ వెనుక వైపు నుండి ఢీకొనడంతో విజయకుమారి(40) మృతి చెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు : గొల్లప్రోలులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన ఎ.చంద్రరావు గత నెల 26న శివరాత్రి సందర్భంగా పిఠాపురం ఆటోలో బయలు దేరాడు. గొల్లప్రోలు బైపాస్ శ్రీరామ్ స్కూల్ దగ్గరలో ఆగి ఉన్న వ్యాన్‌ను చంద్రరావు ప్రయాణిస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్ర రావు తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి కాకినాడ లోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. పరిస్థితి విషమించడంతో మరణించాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

పిఠాపురం : పట్టణ శివారు మాదావపురంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణ పరిధిలోని ఐదో వార్డుకు చెందిన సిహెచ్ సత్యనారాయణ (65) అనే రైతు పశువులకు మేత కోసం పొలానికి వెళ్లి గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా ఆ ప్రాంతంలోని పొలాల పై క్రిందికి వేలాడుతున్న హై టెన్షన్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి, అప్పటికే సత్యనారాయణ మృతి చెంది ఉన్నాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మతిపై పట్టణ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

సామర్లకోట : మండలంలోని గొంచాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థి ప్రగాఢ వంశీ(18) దుర్మరణం చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం...సోమవారం ఉదయం చంద్రపాలెం గ్రామం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు కాకినాడకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా గొంచాల గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఇసక గుట్టపైకి మోటార్ సైకిల్ ఎక్కి జారి పడటంతో అదే సమయంలో వస్తున్న ట్రాక్టర్ వెనుక చక్రాలు విద్యార్థి వంశీ పైనుంచి వెళ్లిపోవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు ఎస్ఐ రమేష్ తెలిపారు

సంతృప్తి పడేలా అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జెసి ఎస్.చిన్నరాముడుతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల నియమావళి పూర్తయినందున వివిధ స్థాయిల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిబంధనలకు అనుగుణంగా పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు దిగువ స్థాయి సెక్షన్ సిబ్బందిపై ఆధారపడకుండా వాస్తవంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిష్కరించాలన్నారు. అర్జీ దారులను స్వయంగా కలిసి వాస్తవ పరిస్థితి వారికి అర్థం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారిని కలిసిన వివరాలు ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎంఎల్‌ఎల ప్రజా వేదిక, ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల ద్వారా వొచ్చిన 285 అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పోలీస్ 61 , విద్యుత్ 31 , రెవెన్యు 65 , పంచాయతి రాజ్ 28 , వ్యవసాయ శాఖ 6 ఉన్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు జిల్లా కేంద్రానికి రావడం, ఒకే ఫిర్యాదు పలు సార్లు రావడం గుర్తించామన్నారు. భూములు , సర్వే, విభజన, మ్యుటేషన్, వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ల కోసం, రేషన్ కార్డులు తదితర అంశాలపై అర్జీలు వస్తున్నాయన్నారు. సచివాలయం స్థాయిలో వివరాలు నమోదు చేసి అర్జీదారునికి వివరించాలన్నారు. ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి వారికి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అర్జీదారులకు కలెక్టరేట్లో స్నాక్స్, టీ అందించారు. పిజిఆర్ఎస్‌లో జిల్లా ప్రత్యేక అవసరాల, వృద్ధులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు వీల్ ఛైర్స్, 10 వినికిడి యంత్ర పరికరాలను కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి చిన్నరాముడు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, డిఎస్‌పి భవ్యకిశోర్, సిపిఒ ఎల్.అప్పలకొండ, డిఎల్‌డిఒలు పి.వీణాదేవి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

తాళ్లపూడి : పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీల సత్వరం పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని,

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఇందులో భాగంగా వారంలో రెండు రోజులు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తామని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత తెలిపారు. సోమవారం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వారంలో రెండు రోజులు ఆయా శాఖలకు సంబంధించి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించి అర్జీలను పరిష్కరిస్తామనారు. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎఒ రవివిక్రమ్, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాల సాధనకు చర్యలు

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకుంటున్నామని జెసి చిన్నరాముడు తెలిపారు. సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్, సర్వే, రైతు పంట వివరాలు నమోదు, ఇండ్ల నిర్మాణం, డ్వామా తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ నిర్మాణ పనుల ప్రగతిలో 10,794 ఇళ్ల నిర్మాణాలకు 4604 ఇళ్లను పూర్తి చేసి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడు రోజుల పనితీరులో 1,232 కన్వర్షన్‌లో 254(21 శాతం) మాత్రమే లక్ష్యాలను సాధించారన్నారు. దీనిపై అధికారులను వివరణ కోరారు. మార్చి 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను

సమావేశంలో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

సాధించేందుకు రోజువారీ లక్ష్యంగా చేసుకొని ప్రగతి చూపాలని సూచించారు. డ్వామా ఉపాధి హామీ పథకం కింద 53 లక్షల పని దినాలకు 49.18 లక్షలు (92.79) సాధించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, సిపిఒ ఎల్.అప్పల కొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు

ఆటంకాలు లేకుండా ఇసుక సరఫరా

జిల్లా స్థాయి ఇసుక సమావేశంలో జెసి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇసుక సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను జెసి ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. జెసి ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన సోమావరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి చిన్నరాముడు మాట్లాడారు. ఇసుక సరఫరా ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించడానికి, వినియోగదారులు ఎదుర్కొనే ఇబ్బందులను తొలగించడానికి అదనపు చర్యలను అమలు చేయాలని సిఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీల జవాబుదారీతనం, పారదర్శకతను పెంచడానికి సరఫరా నిర్వహణను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సభ్యులు వెంటనే సంబంధిత జిల్లా స్థాయి ఇసుక కమిటీల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఏజెన్సీ ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన ప్రత్యేక నెంబర్‌తో అన్ని వాహనాలకు ఇసుకను సరఫరా చేయాలన్నారు. చెల్లుబాటు అయ్యే క్యూ నంబర్ లేకుండా ఏ వాహనానికి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వరాదన్నారు. ఇసుక రవాణా వ్యవస్థ నేపథ్యంలో ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామన్నారు. వాటిలో వచ్చే ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. బహిరంగ ఇసుక రీచ్‌ల స్థితి, చట్టబద్ధమైన అనుమతులు పొందే ప్రక్రియలో ఉన్న రీచ్‌లు, చెల్లింపులు విషయంలో రసీదులు, ఖర్చుల కోసం బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్, ఎంపానెల్డ్ కమిటీకి సమర్పించాల్సిన ప్రతిపాదనలు, పట్టా భూముల్లో ఇసుక డీ-కాస్టింగ్, ప్రతికూల వార్తాంశాలపై తీసుకున్న చర్యల నివేదిక, ఐవిఆర్ఎస్ కాల్‌ల ద్వారా వినియోగదారుల అభిప్రాయం , ఉచిత ఇసుక విధానం కింద జారీ చేసిన తదుపరి మార్గదర్శకాలు, పర్యవేక్షణా బాధ్యత నిర్వహిస్తున్న అధికారుల, సిబ్బంది విధులు బాధ్యతలు నేపథ్యంలో ధరల ప్రదర్శనా నిర్వహించే విధానంపై కమిటీ చర్చించింది. ఈ సమావేశంలో మైన్స్ ఎడి డి.ఫణిభూషణ్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బ రాజు, ఆర్‌డిఒలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణనాయక్, డిపిఒ వి.శాంతమణి, ఆర్‌టిఒ ఆర్.సురేష్, గ్రౌండ్ వాటర్ డిడి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ డిఇ కె.ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభ ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని చిత్రాడ వేదికగా మార్చి 14వ తేదీన జరగనున్న జనసేన పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై ఎస్‌పి బిందుమాధవ్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించారు. సభకు తరలి వచ్చే లక్షలాది కార్యకర్తలు, అభిమానులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ముఖ్యంగా ట్రాఫిక్ మళ్లింపులు, నిర్దేశిత పార్కింగ్ స్థలానికి వాహనాలు తేలికగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ చేస్తున్న ఏర్పాట్లను అధికారులకి తెలిపారు. అనంతరం ప్రధాన వేదిక, డి జోన్, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాలరీ, మీడియా గ్యాలరీ, విఐపి గ్యాలరీలను పరిశీలించారు. సభా ప్రాంగణంలోనూ, హైవే వెంబడి సిసి కెమెరాలు ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎంపి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు

ఏర్పాట్లును సమీక్షిస్తున్న మంత్రి మనోహర్

పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్, డిఎస్‌పి శ్రీహరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రణాళికను సిద్ధం చేయాలి

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రజాశక్తి - కాకినాడ

హోప్ హైలాండ్ ఎకో టూరిజంని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌పి జి.బిందు మాధవ్, జిల్లా అటవీ శాఖ అధికారి ఎ.రవీంద్రనాథ్‌రెడ్డి, పోర్టు అధికారి కెప్టెన్ ధర్మశాస్త్ర, అటవీ, పర్యాటక, మత్స్య, మెరైన్ పోలీస్ శాఖల అధికారులతో కలిసి హోప్ ఐలాండ్‌లో కలెక్టర్ పర్యటించారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం కార్యాలయం నుంచి హోప్ ఐలాండ్‌కు చేరుకుని అక్కడి ప్రదేశాలను పరిశీలించారు. ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉన్న పరిస్థితులు, హోప్ హైలాండ్ పరిధి, మడ అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, సందర్శకులకు బోటింగ్ సౌకర్యం ఇతర అంశాలను ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హోప్ ఐలాండ్ ప్రాంతాన్ని పర్యాటక రంగానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మత్స్యశాఖ అధికారి కె. కరుణాకర్‌బాబు, ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్, సెక్షన్ అధికారి ఎం.నాగా ర్జున, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, వాటర్ ఫ్లీట్ అసిస్టెంట్ మేనేజర్ గంగాబాబు, పోర్ట్ సిఐ పి.సునీల్‌కుమార్, మెరైన్ ఎస్ఐ పి.సురేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం: వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

టిడిపి అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాల యంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 23 ఏళ్లుగా టిడిపి అధినేత చంద్రబాబుతోనే తన ప్రయాణం కొనసాగించానని, అధికారంలో ఉన్న లేకపోయి నా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేశానన్నారు. పార్టీకి, ప్రజలకు అండగా ముందు కు వెళుతున్నన్నారు. తనకి ప్రజా సేవ చేయడా నికి అవకాశం కల్పించడమే చంద్రబాబు తనికి ఇచ్చిన గొప్ప పదవన్నారు. పిఠాపురం టిడిపి శ్రేణులు మొత్తం చంద్రబాబు, భవిష్యత్ రథసారథి మంత్రి లోకేష్‌కి అండగా ఉండాలని, వారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తానన్నారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పార్టీని బలపరుస్తూ పిఠాపురం

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ

టిడిపి నడుస్తుందని, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. పదవులు కేటాయించేటప్పుడు అధినేత ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని నాయకులు, కార్యకర్తలు, అర్థం చేసుకోవాలన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి గత ఎన్నికల్లో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి విజయానికి కృషి చేశామన్నారు.

ముస్లిములను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ అశోక్

ముస్లిములకు ఎంఎల్‌ఎ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - యానాం

యానాంలో ముస్లింలకు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక జామియా మసీదు, మసీదా కూబాల్లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జామియా మసీదు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించడానికి, ముస్లిం బరేల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఘసూలాఖానాకు అదనంగా మరో రూ.16 లక్షలు అందించనున్నట్టు ప్రకటించారు. ముస్లిం షాదీఖానాకు రూ.40 లక్షలు త్వరలోనే మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమామ్‌లు మహమ్మద్ రఫీ, మహ్మద్ ఎజ్జానీ, మసీదుల అధ్యక్షులు ఎస్‌కెమ్.జిలానీ, కాలేషా, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సత్తిరాజు కుటుంబానికి కోమట్లపల్లి పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

మండలం కొత్తపల్లి అగ్రహారం ఎంపిటిసి మాజీ సభ్యులు, నిడదవోలు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు కుటుంబాన్ని టిడిపి నాయకులు, ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, కాల్దారి గ్రామ టిడిపి అధ్యక్షులు కోమట్లపల్లి రామదాసు సోమవారం పరామర్శించారు. సత్తిరాజు తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారు పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

విద్యార్థిని సుగుణను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

చిత్రలేఖనంలో గుమ్మలదొడ్డి విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరం గోదావరి బాలోత్సవం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో జూనియర్ విభాగంలో గుమ్మళ్లదొడ్డి జడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఇ.సుగుణ ప్రథమ బహుమతి సాధించింది. ఈ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారని హెచ్‌ఎం లక్ష్మీకాంతం తెలిపారు. ఈ సందర్భంగా సుగుణను, డ్రాయింగ్ టీచర్ శ్రీదేవిని ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

జనార్ధన స్వామి కళ్యాణోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కడియం

కడియంలోని శ్రీ నవ జనార్ధన స్వామి కళ్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదాంతం జగన్నాథచార్యులు, ఖండవల్లి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెవివి.రమణ తెలిపారు. ఈసందర్భంగా వంశపారంపర్య ప్రధాన అర్చకులు వేదాంతం చక్రపాణి మాట్లాడుతూ మార్చి 10 తేదీ నుంచి 14 వరకూ ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు.

ఘనంగా సంతాన దేవుని కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సంతాన దేవునిగా పిలవబడుతున్న తాళ్లపూడిలోని రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి వార్షిక కళ్యాణోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజ అనంతరం సోమవారం రాత్రి ఆలయంలో జరిగిన కళ్యాణోత్సవంలో పరస వంశీకులతో పాటు గ్రామ సర్పంచ్ అక్క అనురాధ దంపతులు ఇతరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

In the Court of the VIth Addl. Junior Civil Judge, Rajahmundry

O.S. 47/2024

Between:
Dadi Jaya Madhuri @ Jaya Badhuri ***...Plaintiff***
AND
B.Kanaka Ratnam and Others ***...Defendants***

D-4: Smt. Kandregula Sai, W/o. Nagendra @ Bujji, D.No. 5-204/A, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-9: Smt. Bheesetti Saraswathi, W/o. late Nageswara Rao, D/o. late B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-10: Smt. Koyilada Saroja, W/o. K.Ramu, D/o. B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

పై నెంబరులో మీకు నోటీసు నిమిత్తం **ది. 26-3-2025 సం॥** తేదీకి శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు ఆ వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి **సిహెచ్.వి.ప్రసాద్**
10-3-25 వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 315/2022

Between:
Peyyala Suseela and Others ***...Petitioners***
AND
J.Srinivasu and Others ***...Respondents***

R-2: P.Sudhakar, S/o. Satyanarayana, Hindu, aged 50 years, R/o. D.No. 1-46-61, T.B.Road, Annajipeta, Tuni, E.G.District, Owner of the vehicle bearing No: AP 01 V 0549 ***...2nd Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **డి.పల్లవి**
02-3-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

చాగల్లు మండలంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో సోమవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. చాగల్లు, దారవరం, బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, ఊనగట్ల, నేలటూరు, మల్లవరం గ్రామాల్లో కరపత్రాల ద్వారా తడి - పొడి చెత్త సేకరణపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తారన్నారు. చెత్తను ఇంటింకి వచ్చే పారిశుధ్య సిబ్బందికే అందించాల న్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తెల్లవారుజాము 5.30 గంటల నుంచే ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి ఆర్.శ్రావణ్ కుమార్ ఈ కార్యక్రమంపై తనిఖీలు నిర్వహించారు. .

కాపు కళ్యాణ మండపం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని మల్లేశ్వరంలో కాపు కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో దీన్ని నిర్మిస్తున్నారు. సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, ఎంపిటిసి సభ్యురాలు కోటిపల్లి దేవికారాణి ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బొలిశెట్టి పట్టాభి రామారావు, మాజీ ఎంపిపి కోటిపల్లి మురళీకృష్ణ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE

I, VADLAPATI NARESH (Old Name), S/o POORNACHANDHRARAO, D.No.4-227, Rayabhupalapatnam Village, Peddapuram Mandalam, Kakinada District, Andhra Pradesh -533 437. I have changing my name from **VADLAPATI NARESH** (Old Name), to **VADLAPATI NANI** (New Name).Hence forth I am being called as **VADLAPATI NANI** For all purpose.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు గ్రామపంచాయితి జై బీమ్ పేటకు చెందిన దున్నానీలాద్రి S/o రామస్వామి, సర్వే **నెం.182/1ఎ/2లో** గల 2.30 సెంట్లు సంబంధించిన తన బార్య దున్నా పాపయమ్మకి వ్రాసిఇచ్చిన డాక్యుమెంట్ **నెం. 343/2023** గల డాక్యుమెంట్ పోలేకుర్రు గ్రామం నుంచి తాళ్ళరేవు వచ్చు మార్గంలో పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రంది అడ్రస్‌కు తెలియపరచవలెను.

అడ్రస్
దున్నా నీలాద్రి S/o రామస్వామి
డోర్ నెం. 1-7 పోలేకుర్రు, తాళ్ళరేవు మండలం
కాకినాడజిల్లా

ప్రకటన

కీ॥శే॥ **రేవు సుందరమ్మ** గారు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, ఎదుర్లంక గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న రామాలయం పేట గ్రామ కాపురస్తురాలు రేవు సుందరమ్మ, W/o. రేవు సుబ్రమణ్యం (లేటు) గారి కుమారుడు రేవు సుధాకర్ వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తల్లి **రేవు సుందరమ్మ** గారు రామాలయం పేట గ్రామంలో మా ఇంటి వద్ద 03-03-2012 సంవత్సరంలో మరణించారు. వీరి మరణం ఎదుర్లంక గ్రామ పంచాయతీలోను మరియు ఏ ఇతర గ్రామపంచాయతీలోను నమోదు కాలేదు. ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: రేవు సుధాకర్
సుబ్రమణ్యం, డోర్ నెం. 1-28, రామాలయం పేట, ఎదుర్లంక (పోస్టు), ఐ.పోలవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పిన్‌కోడ్: 533464

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 30/2019, O.S. 258/2014

Between:
మహమ్మద్ జకీరా బేగం ***...DHr***
AND

1) మహమ్మద్ హాస్నా భాను, W/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 63 సం॥లు, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

2) మహమ్మద్ బషీరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 30 సం॥లు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

3) మహమ్మద్ హాజరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 27 సం॥లు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

యీ నెంబరు డిక్రీ బాకీ వసూలు గాను JDrs తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 21-3-2025వ తేదీన ఉదయం 10.30 ని॥ల** లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట వేలం జరుగును. కావలసినవారు వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు సబు రిజిష్ట్రీ, కొవ్వూరు మండలం, కొవ్వూరు మున్సిపల్ ఏరియా ఆర్.ఎస్. నెం. 576/1, పూరా చ॥ 396 గజములలో తూర్పు వైపు చ॥ 198 చ॥ స్థలము సమీప డోరు నెంబరు 15-9-69 నకు హద్దులు.

తూర్పు: దుద్దుపూడి నాగేశ్వరరావు స్థలం. **దక్షిణం:** 30 అ॥ వెడల్పు రోడ్డు. **పడమర:** వలగల వెంకటరెడ్డి కోర్టు ద్వారా కొన్న 198 చ॥ ఖాళీ స్థలం. **ఉత్తరం:** దుద్దుపూడి వెంకటకృష్ణ లేఅవుట్‌లోని ప్లాట్ నెం. 1 మరియు ప్లాట్ నెం. 10.

యీ హద్దుల మధ్య చ॥ 198 గజములు స్థలము యీజిమెంటరీ హక్కులతో సహా.

అమీనా విలువ: రూ. 8,50,000/-
DHr విలువ : రూ. 8,50,000/-
JDrs విలువ: ఏమియున్ను యిచ్చియుండలేదు.

డి.రవిశంకర్
DHr తరపు న్యాయవాది
కొవ్వూరు కొవ్వూరు
28-2-2025 సెల్: 9848305552